పోలీస్ స్టేషన్‌లో లంచావతారం

రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన హెడ్ కానిస్టేబుల్

పట్టుబడిన హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు

మామిళ్లగూడెం, జనవరి 29: ఖమ్మం నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రైటర్ విధులు నిర్వర్తిస్తూ అవినీతికి పాల్పడుతున్న ఓ హెడ్ కానిస్టేబుల్‌ను సోమవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన బూర్ల రామారావుకు ఇద్దరు కుమారులు విజయ్, విష్ణు. కుమార్తె నాగజ్యోతి. తండ్రికీ తనయకు మధ్య కొన్నాళ్ల నుంచి ఆస్తి తాగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగజ్యోతి తనను తండ్రితో పాటు ఇద్దరు సోదరులు ఆర్థికపరమైన విషయాల్లో మోసం చేశారని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిలు కోసం రామారావు, అతని కుమారులు విష్ణు, విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వారికి 41ఏ సీఆర్పీసీ నోటీసు అందించేందుకు రైటర్, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. హెడ్‌కానిస్టేబుల్ అవినీతిపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలని స్కెచ్ వేశారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో రామారావు కుటుంబం నుంచి హెడ్‌కానిస్టేబుల్ రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అవినీతిపై స్టేషన్ పరిధిలో మిగిలిన సిబ్బందిపైనా విచారణ చేపడుతున్నామని, ఎవరి పాత్ర అయిన అవినీతిలో ఉందని తేలితే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిందితుడు కోటేశ్వరరావుపై సీపీ సునీల్‌దత్ ఒకటి రెండు రోజుల్లో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నదని పోలీస్ వర్గాలు తెలిపాయి.

హెడ్‌కానిస్టేబుల్‌పై ఎన్నో ఆరోపణలు..

లంచం తీసుకుంటూ పట్టుబడిన హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు రెండేళ్ల నుంచి ఖమ్మం నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనపై మొదటి నుంచే అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఈయన అవినీతి పనులపై గతంలోనూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయని తెలుస్తున్నది. ఎస్‌హెచ్‌వోలు ఆయన్ను ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోవడం లేదని, తనకున్న పలుకుబడితో ఏ పనైనా చేయగలననే ధీమాలో ఉంటాడని సమాచారం. పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన అవినీతి శ్రుతి మించడంతోనే కొందరు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించినట్లు పోలీస్ వర్గాల విశ్వసనీయ సమాచారం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

వైరా టౌన్, జనవరి 29: పట్టణంలోని ఠాగూర్ విద్యాలయంలో 2014–15లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాల తరువాత మీరు కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, క్రమశిక్షణతో ఉన్నత ఉద్యోగాలు సాధించి కుటుంబ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, అధ్యాపకులు సంక్రాంతి రవికుమార్, చంద్రశేఖర్, రామకృష్ణ, వేణు, నాగరాజు, రాంబాబు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఖమ్మం రూరల్, జనవరి 29: ఫిబ్రవరి 2 నుంచి మండలంలో ప్రారంభం కానున్న పీఎస్ఆర్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి సోమవారం ఆయన కార్యాలయం ఖమ్మం రూరల్, కూసుమంచి సీఐలు రాజిరెడ్డి, జితేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం టోర్నీ నిర్వాహకుడు ఏనుగు మహేశ్ మాట్లాడుతూ వచ్చే 2 నుంచి 9 వరకు పాలేరు నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీ కేంద్రీయ విద్యాలయం రోడ్ గ్రౌండ్‌లో జరుగుతుందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, జనవరి 29: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని హైదర్‌సాయిపేటలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితుల కథకం ప్రకారం.. మండలంలోని హైదర్‌సాయిపేటలో లూనావత్ వెంకన్న అనే రైతు జొన్న పంట సాగు చేశాడు. ఆ పంటను కోతులు ధ్వంసం చేస్తుండడంతో వాటిని నివారించేందుకు చేను చుట్టూ వైరు చుట్టి దానికి కరెంటు కనెక్షన్ ఇచ్చాడు. ఈ క్రమంలో లూనావత్ వెంకన్న జొన్న చేను నుంచి తమ పొలం వద్దకు వెళ్తున్న అదే గ్రామానికి చెందిన షేక్ యాకూబ్‌పాషా (26) కాలుకు విద్యుత్ తీగ తగిలింది. దానికి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతమై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్క్ట్రికల్ పనులు చేస్తూ జీవించే యాకూబ్‌పాషా అతడి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తూ విద్యుదాఘాతానికి గురైన మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి జానిమియా పిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
కావలెను
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మెగా ఫుడ్‌పార్కును రైతులు వినియోగించుకోవాలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఫుడ్‌పార్కు అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి టౌన్, జనవరి 29: సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్క్‌ను ఈప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. త్వరలో పార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తారన్నారు. సోమవారం ఆయన మెగా ఫుడ్ పార్క్‌ను సందర్శించి మాట్లాడారు. రైతులు, ప్రొఫెసర్లు, రీటైలర్లను ఏకతాటిపైకి తెచ్చి, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు అనుసంధానించేందుకే ఫుడ్‌పార్క్ నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం పార్క్‌కు జీడి పప్పు, మామిడి ప్రాసెసర్లు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే అన్ని పంటలకు ప్రాసెసర్లు వస్తాయన్నారు. రైతులు పండించిన పంటను ఇక్కడ స్టోర్ చేసుకోవచ్చన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకుని ఇప్పటికే కొన్ని కంపెనీలతో ఒప్పందం చేసుకున్నారన్నారు. ఇదే కోవలో ఖమ్మం జిల్లా కోసం గోద్రేజ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,500 రైతువేదికలో ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి వ్యవసాయ శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, ఆదర్శ రైతులతో ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫుడ్ పార్కు పరిధిలో మిగిలిన ఉన్న పనులను సత్వరం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు రాగమయి, జారే ఆదినారాయణ, పరిశ్రమలశాఖ జోనల్ మేనేజర్ పవన్‌కుమార్, జిల్లా పరిశ్రమల విభాగ అధికారి అజయ్‌కుమార్, కల్లూరు ఆర్డీవో అశోకచక్రవర్తి, ఏసీపీ రామానుజం ఉన్నారు.

ఖమ్మం ఏఎంసీకి 40 వేల బస్తాల మిర్చి

ఖమ్మం వ్యవసాయం, జనవరి 29 : మూడు రోజుల వరుస సెలవుల అనంతరం సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి రైతులు 40 వేల బస్తాల మిర్చిని విక్రయానికి తరలించారు. ఆదివారం రాత్రి నుంచే మార్కెట్‌కు బస్తాల రాక ప్రారంభం కాగా.. ఉదయం జెండాపాట సమయానికి యార్డు మిర్చి బస్తాలతో నిండిపోయింది. జెండాపాటలో క్వింటా మిర్చి గరిష్ఠ ధర రూ.21,300 పలికింది. మధ్య ధర క్వింటాకు రూ.9 వేలు, కనిష్ఠ ధర రూ.14 వేల చొప్పున ఖరీదుదారులు కొనుగోలు చేశారు. అలాగే తాలు రకం క్వింటా గరిష్ఠ ధర రూ.12 వేలు కాగా.. కనిష్ఠ ధర రూ.7,500 పలికింది. ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–టూ అధికారి బజార్‌తో కలిసి యార్డులో క్రయవిక్రయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ సెక్రటరీ మాట్లాడుతూ యార్డుకు పంటను తీసుకొచ్చిన రైతులకు మంచి ధర కల్పించడంతోపాటు సకాలంలో రైతులు ఇళ్లకు వెళ్లే విధంగా కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కాగా.. కాంటాల ప్రక్రియకు విఘాతం కలగకుండా కొత్తగా దడువాయిలకు జీపీఆర్ఎస్ యంత్రాలను అందజేశారు.

ఏఎంసీలో మిర్చి బస్తాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల

'పల్లె ప్రగతి'తోనే పచ్చందాలు: జడ్పీ చైర్మన్

సర్పంచుల వీడ్కోలు సమావేశంలో జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

చింతకాని, జనవరి 29: గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో గ్రామాల్లో పచ్చందాలు పరిమళించాయని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు గుర్తుచేశారు. ఆ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శులు సమర్థవంతంగా పనిచేయడం వల్లనే పల్లెసీమల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సర్పంచుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పల్లెప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో ఏళ్లనాటి విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయని, ప్రభుత్వ పాఠశాలలు, వెటర్నరీ, సబ్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రత వెల్లివిరిసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిశోర్, ఎంపీపీ పూర్ణయ్య, వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి: ఆర్డీవో

కల్లూరు, జనవరి 29 : పట్టభద్రులందరూ త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీవో అశోక చక్రవర్తి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు సమయం ఉందని సూచించారు.

సత్తుపల్లి పట్టణ సీఐగా కిరణ్

సత్తుపల్లి, జనవరి 29 : సత్తుపల్లి పట్టణ సీఐగా టి.కిరణ్ సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ మోహన్‌బాబు ఖమ్మం బదిలీ కాగా ఆయన స్థానంలో భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ఖమ్మం, జనవరి 29 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గ్రీవెన్స్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన గ్రీవెన్స్ దరఖాస్తులను స్వీకరించారు. గత గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల్లో పరిష్కారం అయిన వివరాలను కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మనిషి మనుగడకు సైన్స్ అవసరం

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 29: మనిషి మనుగడకు సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందని ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ దినకర్ అన్నారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు.

సైబర్ నేరాలపై అవగాహన

నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీసీపీఎస్ ఏసీపీ శంకర్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ఎస్ఐ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నోటరీ'ల ఇంటర్వ్యూలు చేపట్టాలి

ఖమ్మం లీగల్, జనవరి 29: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ నోటరీల ఇంటర్వ్యూలు చేపట్టేలా చూడాలని సీనియర్, జూనియర్ న్యాయవాదులు కోరారు. ఈ సందర్భంగా న్యాయవాది తాళ్లూరి దిలీప్ మాట్లాడుతూ.. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు పూర్తి చేసినందున తెలంగాణలో కూడా ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు పూర్తి చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.

కోటపాడు సర్పంచ్‌కి సన్మానం

రఘునాథపాలెం, జనవరి 29 : ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికై ప్రశంసా పత్రాన్ని అందుకున్న కోటపాడు సర్పంచ్ బాతుల రమణసుధాకర్‌ను గ్రామస్తులు సోమవారం గ్రామంలో సన్మానించారు. అభివృద్ధిలో భాగస్వాములై సహకరించిన గ్రామస్తులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

'అంతరాలు లేని విద్య ప్రజల హక్కు'

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 29 : అంతరాలు లేని విద్య ప్రజల హక్కు అని, అలాంటి విద్యను అందరికీ అందేలా చూడడం ప్రభుత్వ బాధ్యత అని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం నయాబజార్ పాఠశాలలో టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉర్సు ఉత్సవాలు

వైరాటౌన్, జనవరి 29 : వైరా బ్రాహ్మణపల్లి హజరత్ సయ్యద్ యాకూబ్‌షావలి ఉర్సు మహోత్సవాలు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. ఉర్సు మహోత్సవాలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు ఆదివారం రాత్రి ప్రారంభించారు. దర్గా ముజావర్ షేక్ అబ్దుల్‌రెహమాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆదివారం రాత్రి దర్గా వద్ద అన్నసమారాధన జరిగింది. ఉర్సు మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చేపల పెంపకానికి మంచి డిమాండ్

కూసుమంచి, జనవరి 29: చేపల పెంపకానికి మంచి డిమాండ్ ఉందని విశ్రాంత సీనియర్ మత్స్య శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. అందుకే గతంకంటే ఎక్కువ మంది రైతులు చేపల పెంపకంపై మక్కువ చూపిస్తున్నారని అన్నారు. 'చేపల పెంపకంలో మెళకువలు – యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ ఉండడంతో మత్స్య రైతులకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

అప్పల నర్సింహాపురానికి ఆర్టీసీ బస్సు

కూసుమంచి (నేలకొండపల్లి), జనవరి 29: నేలకొండపల్లి మండలం అప్పలనర్సిహాపురానికి ఆరేళ్ల తరువాత ఆర్టీసీ బస్సు వచ్చింది. పలు కారణాలతో ఆర్టీసీ అధికారులు గతంలో ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. ఊరి ప్రజల డిమాండ్‌తో మంత్రి పొంగులేటి తిరిగి బస్సు సౌకర్యాన్ని కల్పించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: ఎంపీపీ

కూసుమంచి, జనవరి 29: గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ కోరారు. వచ్చే సంవత్సరానికి గాను టైడ్, నాన్ టైడ్ బడ్జెట్, వార్షిక ప్రణాళిక తయారు కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చెత్త తరలింపు ట్రాక్టర్ల అడ్డగింత

సత్తుపల్లి రూరల్, జనవరి 29: మున్సిపాలిటీ పరిధిలోని చెత్తపోసే ట్రాక్టర్లను సోమవారం జవహర్‌నగర్ కాలనీవాసులు అడ్డుకున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపల్ ట్రాక్టర్ల ద్వారా కొమ్మేపల్లిలో డంపింగ్ యార్డు ఉన్నా అక్కడ కాకుండా తామరచెరువు సమీపంలోని పాత ఎన్టీఆర్ కాలువలో పోస్తున్నారని జవహర్ నగర్ ప్రాంత ప్రజలు అడ్డుకున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సుజాతను వివరణ కోరగా చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశుగ్రాసం తరలింపు

కల్లూరు, జనవరి 29 : ఖమ్మంలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీకృష్ణ గోశాలలకు కల్లూరు నుంచి సుమారు 14 ట్రాక్టర్ల పశుగ్రాసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వితరణ చేయగా వాటిని సోమవారం మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో ఖమ్మం తరలించారు.

'ఉపాధి పనులకు నిధులు కేటాయించాలి'

మధిర, జనవరి 29: ఉపాధి హామీ పనులకు కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం మధిర పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

'గ్రామాల అభివృద్ధి సర్పంచ్‌లతోనే సాధ్యమైంది'

పెనుబల్లి, జనవరి 29 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలన్నీ అభివృద్ధి జరిగాయని, వాటికి ముఖ్య కారణం సర్పంచ్‌లేనని ఎంపీపీ లక్కినేని అలేఖ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యక్రమంలోనూ సర్పంచ్‌లే కీలక పాత్ర పోషించారన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణతో గ్రామాల్లో జ్వరాలు లేకుండా ఉన్నాయని, హరితహార కార్యక్రమం పేరుతో గ్రామాలన్నీ హరితవనంలా మారాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు పాల్గొన్నారు.

'నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి'

కూసుమంచి, జనవరి 29: నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి సూచించారు. నాణ్యతలేని వాటిని ఇష్టారాజ్యంగా విక్రయిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఎరువులు, పురుగుమందుల డీలర్లతో కూసుమంచి రైతువేదికలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఉపాధ్యాయుల పనితీరుపై ఎంపీడీవో ఆగ్రహం

కారేపల్లి, జనవరి 29: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాటిమీదగుంపు ప్రాథమిక పాఠశాలలో నలుగు ఉపాధ్యాయులు ఉండగా ముగ్గురు, రంగురాళ్లబోడు పీఎస్‌లో ఒక ఉపాధ్యాయుడు సోమవారం సెలవు పెట్టడంతో విద్యార్థులకు బోధన జరగలేదు. దీంతో స్థానికులు ఎంపీడీవోకు సమాచారం ఇవ్వగా సీఆర్పీ రాంబాబుకు ఫోన్ చేసి విచారించారు. పాఠశాలలకు సక్రమంగా హాజరుకాని ఉపాధ్యాయులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి'

మధిర, జనవరి 29: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాయల వీరస్వామి కోరారు. మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో వై.ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం జరిగిన మధిర, ఎర్రుపాలెం మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

'స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం'

బోనకల్లు, జనవరి 29: స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయమని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. ఖమ్మానికి చెందిన త్రిబుల్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థుల నీటి వసతి ఏర్పాటు కోసం రూ.50 వేలతో ఏర్పాటు చేసిన చేతిపంపును సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 29: ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 15వరకు 76 కేంద్రాల్లో రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్ పరీక్షలు, ఆంగ్ల ప్రాక్టికల్ ఫిబ్రవరి 16న జరుగుతుందన్నారు. ప్రతి ప్రైవేట్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 16 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఐఈవో రవిబాబు, డీఈవో సోమశేఖరశర్మ, కోశాధికారి సత్యనారాయణ, ఏసీపీ ప్రసన్నకుమార్, గురుకులాల ఆర్‌సీవోలు, ఆర్టీసీ, విద్యుత్, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మధును కలిసిన నాయకులు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, జనవరి 29 : అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్‌ను జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ విషయాలపై వారు చర్చించారు. అంతకుముందు పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును జిల్లా జైలులో తాతా మధు కలిసి పరామర్శించారు. పార్టీ కార్యాలయంలో తాతా మధును కలిసిన వారిలో వైరా మాజీ ఎమ్మెల్యే రాములునాయక్, పలు నియోజకవర్గాల నాయకులు ఉన్నారు.

ఎంపీ నామా మావయ్య కన్నుమూత

సుబ్బారావు అంత్యక్రియల్లో ఎంపీ నామా

ఖమ్మం, జనవరి 29: బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మావయ్య, సినీ హీరో వేణు తండ్రి ప్రొఫెసర్ తొట్టెంపూడి వెంకట సుబ్బారావు (92) సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతిచెందారు. సోమవారం సుబ్బారావు పార్థివ దేహాన్ని ఎంపీ నామా సందర్శించి సంతాపం తెలిపి నివాళి అర్పించారు. అంత్యక్రియల్లో నామా కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు ఎంపీ నామాను, సినీ నటుడు వేణును కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీఎంఎస